క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



అంజనన్నను దర్శించుకుంటున్న ఆలయ ప్రతినిధులు, భక్తులు

పెందుర్తి: మండలంలోని పినగాడి దరి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తమలపాకులు, సింధూర అర్చన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం నిర్వహించినఅన్నసమారాధనలో దాదాపు 2 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. పినగాడి, రాంపురం, కోట్నివానిపాలెం, గొరపల్లి, గంగమ్మపేట, కరకవానిపాలెం, మొగలిపురం గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరం

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం చిన్నారులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం నేర్పించారు. అనంతరం ధ్యానం చేయించారు. జ్ఞానేశ్వరి టీచర్ విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన పై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు కర్రి సత్యనారాయణ స్పీడ్ మ్యాచ్ నేర్పించారు. జానకిరామ్ భక్తి గీతాలను ఆలపించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నివేదించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించా రు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ పంపిణీ చేశారు.

పింఛన్‌దార్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోషియేషన్ పెందుర్తి శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చినముషిడివాడలోని పంచవటి కార్యాలయంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా అల్లం కృష్ణారావు, కార్యదర్శిగా వై.కామరాజు ఎన్నికయ్యారు. కోశాధికారిగా కట్టా పాపారావు, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.వి.వి.ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా డి.భాస్కరరావు, ఎ.ఈశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా బి.రామునాయుడు, వై.జగన్నాథరావు, సభ్యులుగా సి.హెచ్. అప్పలనాయుడు, కె.అప్పారావు, ఎస్.కన్నరాజు, జి.రామానందం ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో ముస్లిం మైనార్టీలకు కేటాయించిన కబరిస్థాన్(శ్మశాన వాటిక) స్థలం దురాక్రమణ కాకుండా అడ్డుకోవాలని మసీదు కమిటీ సభ్యులు, మైనార్టీలు డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 258లోని 0.50 సెంట్లు శ్మశాన వాటికకు కేటాయించారన్నారు. అప్పటి నుంచి ముస్లింలు ఎవరు చనిపోయినా మత ఆచారాల ప్రకారం అక్కడే సమాధి చేస్తున్నామని వివరించారు. ఇటీవల స్థల రక్షణ కోసం ప్రహరీ నిర్మించుకోవడానికి సిద్ధం కాగా సబ్బవరం పోలీసులు పిలిచి ఈ స్థల వివాదం కోర్టులో ఉందని ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టవద్దని నోటీసులు చూపించారన్నారు. దీంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. ఇంతలో కొందరు కబరిస్థాన్ స్థలం ఆక్రమణకు పాల్పడుతూ తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.స్థలాన్ని కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్ రహీం బీబీ,ఎస్‌కే ఖాన్,ఎస్‌కే చెల్లా సాహెబ్,షేక్ బాబ్జీ,షేక్ నాగూర్ తదితరులు ఉన్నారు.

గాలివాన బీభత్సం



గొర్లివానిపాలెంలో కూలిన 220 కేవీ విద్యుత్ స్తంభం



వెన్నలపాలెం రహదారిలో కూలిన భారీ వృక్షం



ఎన్టీపీసీ వద్ద గాలికి కూలిన ఎన్టీపీసీ హోర్డింగ్

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ఉరుములు, పిడుగుల ధాటికి భయకంపితులైన ప్రజానీకం



ఎన్టీపీసీ వద్ద కూలిన భారీ వృక్షం



దేశపాత్రునిపాలెంలో కూలిన ఎల్‌టీ విద్యుత్ స్తంభం

పరవాడ: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రాత్రి 1.20 గంటలకు గాలి, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం ప్రారంభమైంది. పిడుగులు, ఉరుముల ధాటికి ప్రజలు భయకంపితులయ్యారు. ఇళ్లలో ఉన్నా భయంతో వణికిపోయారు. అనేక చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి ఎన్టీపీసీ, ఊటగెడ్డ, పరవాడ, గొర్లివానిపాలెం, వెన్నలపాలెం రహదారుల్లో చెట్ల కొమ్మలు విరిగి పడడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఎన్టీపీసీ రహదారిలో పరిపాలన భవనం వద్ద చెట్లు విరిగిపడ్డాయి. గాలులకు ఎన్టీపీసీ హోర్డింగ్ రేకులు ఎగిరిపోయాయి. ఊటగెడ్డ కూడలి వద్ద చెట్లు కూలాయి. పరవాడ, వెన్నలపాలెం రహదారుల్లో భారీ వృక్షాలు నేలకూలడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. గొర్లివానిపాలెం వద్ద 220 కేవీ భారీ విద్యుత్ స్తంభం కూలడంతో 11కేవీ, ఎల్‌టీ లైన్లకు తీవ్ర నష్టం సంభవించింది. దేశపాత్రునిపాలెంలో 3, గొర్లివానిపాలెంలో4, బొద్దపువానిపాలెంలో 5, ముత్యాలమ్మపాలెంలో 2 చొప్పున విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అలాగే ముత్యాలమ్మపాలెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది.

అంధకారంలో ప్రజలు

ఫలితంగా శుక్రవారం రాత్రింతా ప్రజలు అంధకారంలో అలమటించారు. శనివారం మధ్యాహ్నం వరకు అనేక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించని కారణంగా గ్రామీణ ప్రజలు తాగునీటికి అవస్థలు పడ్డారు. ఉరుములు, మెరుపులు కారణంగా టీవీలు, ఫ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. మండలంలో వర్షం కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లలో త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఏఈ శేషసాయి చెప్పారు.

పరిశీలన

భారీ వర్షంతో శుక్రవారం రాత్రి గొర్లివానిపాలెం వద్ద నేలకూలిన 220 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఈపీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి శనివారం పరిశీలించారు. విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించే చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. జరిగిన నష్టాన్ని అంచన వేస్తున్నామన్నారు. 11 కేవీ, ఎల్‌టీ లైన్ల మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. డైరెక్టర్ శ్రీనివాసమూర్తి వెంట సంస్థ ఎస్‌ఈ మహేంద్రనాథ్, ఈఈ ఎస్.రామకృష్ణ, పరవాడ సెక్షన్ ఏఈ శేషసాయి ఉన్నారు.

పిడుగుపాటుకు రెండు పాకలు దగ్ధం

సబ్బవరం: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ ఉరుములు,మెరుపులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. పలు చోట్ల పిడుగులు పడడంతో పాటు చెట్లు నేలకు ఒరగడంతో పక్కా గృహాల్లో ఉన్నవారు సైతం ఆందోళనకు గురయ్యారు.శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం మధ్యాహ్నం వరకూ మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.విద్యుత్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పిడుగులు పడడంతో చాలా నివాసాల్లో గృహోపకరణాలు,ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి.

వంగలి గ్రామంలో పిడుగులు పడి రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి.పాకలో ఉన్న చూడి ఆవుకు మంటలు అంటుకొని తీవ్రంగా గాయాలయ్యాయి. మరో మూడు ఆవులు కన్నెలు తెంపుకొని బయటకు పరుగులు తీశాయి. రైతు కనకరాజు పశువైద్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వైద్య సేవలు అందించారు. చూడి ఆవు పరిస్థితి కొంత విషమంగా ఉన్నట్లు తెలిపారు. రూ.2 లక్షల వరకూ ఆస్తి నష్టం ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



మంటలకు తీవ్రగాయాలైన చూడి ఆవు



వంగలిలో పిడుగుపాటుకు దగ్ధమైన పశువుల పాకలు

మరింత రుచిగా గోరుముద్ద

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు

సబ్బవరం: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద అందించే గోరుముద్దను మరింత రుచికరంగా అందించనున్నట్లు అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ చెప్పారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం గోరుముద్దపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 6 రోజుల పాటు ఆరు రకాల వంటలపై అవగాహన కల్పించనున్నారు. శిక్షణ కార్యక్రమానికి మండలంలోని 52 పాఠశాలల నుంచి నిర్వాహకులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా డేటా ఎనలిస్ట్ ఎస్ రవి,ఎంఈవోలు బీఎస్ఎన్ మూర్తి,లక్ష్మణరావు, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

భవితలో దివ్యాంగ బాలలకు పూర్తి వసతులు



భవిత కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న గీత

పెందుర్తి: దివ్యాంగ బాలల కోసం భవిత కేంద్రాల్లో పూర్తి స్థాయి సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చుతుందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత అన్నారు. పెందుర్తిలోని భవిత కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు 40 రోజుల నుంచి 18 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పెందుర్తిలో ఇప్పటివరకు 35 మందిని గుర్తించామన్నారు. భవిత కేంద్రం ద్వారా ఆయా పిల్లలకు ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, విద్యా బోధన తదితర సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ సమగ్ర శిక్ష ద్వారా విద్య ఉపకరణాలు, అలవెన్స్‌లు, వైద్య సదుపాయం అందిస్తున్నామని వివరించారు. విద్యాకానుక కిట్లు, డ్రై రేషన్ కూడా అందుతుందన్నారు. అలాగే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు భవిత సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. సహిత విద్య ఉపాధ్యాయులు బి.ఎ.వి నాగేశ్వరరావు, కాంతి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన బీఆర్‌టీఎస్ విస్తరణ పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం



బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధి అడవివరం నుంచి పాత గోశాల వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులను శనివారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ముఖ్యంగా కాలువలు, కల్వర్టులతో పాటు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డుపై దుమ్ము, ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు నీటిని చల్లాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను, జోనల్ కమిషనర్ హైమావతిని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ సుబ్బారావు, డీసీపీ పద్మజ, ఏసీపీ రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

డీసీపీ సత్తిబాబు



మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు



హాజరైన పలు పార్టీల నాయకులు

సింహాచలం: సార్వత్రిక ఎన్నికల కౌంటిగ్ నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని నగర లా అండ్ ఆర్డర్ డీసీపీ సత్తిబాబు సూచించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో శనివారం సాయంత్రం సింహాచలం దరి బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో డీసీపీ సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు, ఆతర్వాత రోజుల్లో కూడా ఎలాంటి అల్లర్లకు పాల్పడినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 144 సెక్షన్ ఉంటుందని, దాని కణుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. గెలుపు తర్వాత 4,5,6 తేదీల్లో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్ పెడితే వెహికల్స్ సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైతే ఆర్గనైజ్ చేశారో వారిని అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అలాగే బాణసంచా కాల్చినా.. విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సోషల్ మీడియాలో ఎలాంటి కామెంట్లు చేయకూడదన్నారు. రౌడీషీట్లు ఓపెన్ చేయడానికి కూడా వెనుకాడబోమన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా తమ కార్యకర్తలకు ఈ విషయాలని చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ సురేష్ పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

శ్రీరామదూతం.. నమో నమామి



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



అభయాంజనేయస్వామిని దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు వేకువ జాము నుంచి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు పంచామృత, గంధ, విభూది, పండ్ల రసాలతో అభిషేకం, తమలపాకులతో అష్టోత్తరం, సింధూరంతో అర్చన జరిపారు.



స్వామిని దర్శించుకుంటున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



హోమం నిర్వహిస్తున్న పండితులు



సుజాతనగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేసిన గదలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న చొక్కాకుల వెంకటరావు దంపతులు



పరవాడలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెంలో హనుమజ్జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు లక్ష్మి దంపతుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా కోలాటం పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన కోలాటం జట్లకు వెంకటరావు చేతులమీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనను వెంకటరావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దేముడు బాబు,గొంప దేముడు బాబు తదితరులు స్వామివారిని దర్శించుకొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతిని విశేషంగా నిర్వహించారు. ఉదయం 6.30నుంచి స్వామికి పంచామృతాభిషేకం, 7గంటలకు సహస్రనామార్చన, 9 గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేక సర్గపారాయణ, 9.30 నుంచి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

పరవాడ: మండలంలోని పరవాడ, వెన్నలపాలెం జంక్షన్, సబ్‌స్టేషన్ కూడలి, వెన్నలపాలెం, రావాడ, ధర్మారాయుడుపేట, దేశపాత్రునిపాలెం, భర్నికం, పెదముషిడివాడ గ్రామాల్లో హనుమాన్ జయంతిని నివారం ఘనంగా నిర్వహించారు. పరవాడ గ్రామంలోని పలు చోట్ల ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామిని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, నాయకులు పైల అప్పలనాయుడు, రెడ్డి నగేష్, బొండా శ్రీను, కన్నూరు దిఇలపి, రెడ్డి వెంకునాయుడు, బొద్దపు అయ్యబాబు పాల్గొన్నారు.

- వెన్నలపాలెం సినిమాహాలు జంక్షన్‌లో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, గండి ఈశ్వరరావు పాల్గొన్నారు.
- భర్నికంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

పెందుర్తి: సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని సంకట మోచన అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, రాధామల్లిక దంపతులు దర్శించుకున్నారు.